# ఉత్తరం

- శైలజామిత్ర



ఉలిక్కిపడ్డాను... నా వెనుక ఏదో శబ్దం.. వెనక్కి తిరిగాను...ఏదో పోస్టులా ఉంది... బరువుగా ఉంది కూడా... చిన్నతనం నుండి పోస్టు అంటే ఏదో తెలియని ఆత్మీయత... అందుకే వెంటనే లేచి కవర్‌ను చేతిలోకి తీసికొన్నాను. తీరా అడ్రసు చూస్తే నాది కాదు... ఎవరిదో తెలియదు..... ఆ పేరుగల వాళ్ళు ఎవరూ ఈ ఏరియాలో తెలియరు. ఇదివరకు ఉండి వెళ్ళినవారేమోనని ఊరుకున్నా.... అయినా ఏదో బాధ... నా చేతికొచ్చిన పోస్ట్ నాది కాకపోవటం ఏమిటి? ఇలా ఎప్పుడూ జరగలేదు. అమ్మ ఉత్తరం రాస్తానంది... రాసి ఉండొచ్చుగా.... చెల్లీ రాస్తానంది... ఛీ... ఎవ్వరూ రాయలేదు... స్నేహితులున్నారు... వారైనా అంటే అదీ లేదు... ఛీ.. ఈ రోజు నా మూడ్ అంతా పాడయ్యింది.... నా దృష్టిలో ఉత్తరం అంటే ఆత్మీయత. ఉత్తరం అంటే మనసుకు ఊరడింపు....సరే...నా మనోవేదన భరించలేక ఒక నిర్ణయానికి వచ్చేను.... ఆ వుత్తరమే చదవచ్చుగా... ఇతరుల ఉత్తరాల్ని చదవకూడదని తెలుసు కాని వాళ్లు ఎవ్వరూ ఇప్పుడు లేరుగా... అనుకుంటూ... కవర్ తెరిచాను...అందులో ఉన్న అక్షరాలు అందంగా లేకున్నా చాలానే వ్రాసారు..

"చిన్నా... నేను మీ మావయ్యను రాస్తున్నాను. మీ అమ్మ నాన్న ఇద్దరూ పోయి ఇప్పటికి ఆరేళ్ళు గడుస్తోంది. ఆస్తంతా నీ పేరు మీద రాసినా నీకు చెంది ఇప్పటికి ఏడాది గడుస్తోంది. మా అబ్బాయిని పెళ్ళి చేసుకుంటావని ఇన్నాళ్ళు ఆశపడ్డాను. కానీ నువ్వెర్నో ప్రేమించావని తెలిసింది. అంటే ఆస్తి నాకు దక్కే ఆశ లేదు... చిన్నతనం నుండి మీదగ్గరే ఉండి,మీ అమ్మా నాన్నకు సేవ చేస్తూనే గడిపాను. ఫలితం లేదు... ఇకపై ఉంటుందని ఆశకూడా లేదు. కనుక పాయింట్‌కు స్ట్రెయిట్‌గా వస్తున్నా....

నీ ఆస్తి నాకు సగం రాసిచ్చేయి... లేకుంటే! నిన్ను ఎక్కడా బతకనివ్వను.. ఇదివరకే ఇలాంటి ఉత్తరం రాస్తే నీదగ్గరనుండి జవాబు లేదు... అక్కడ అసలు నువ్వున్నావా? లేదా? ఈ సారి కూడా సమాధానం రాకుంటే నా ఏర్పాట్లులో నేనుంటాను. జీవితంపై ఏమాత్రం ఆశ వున్నా నాతో పెట్టుకోకు.. అంటూ దీర్ఘంగా రాసిన ఉత్తరం చదివిన నాకు ముచ్చెమటలు పోసాయి. పాపం ఈ చిన్నా...ఎవరు? ఎవర్ని అడిగినా ఇదివరకు మీ ఇంట్లో ఉండేవారు అంటున్నారే తప్ప. ఇప్పుడెక్కడుందో తెలియటం లేదు. అంటున్నారు. అందుకే మళ్ళీ ఆ ఉత్తరాన్ని మూసేశాను. రీ డైరెక్ట్ చేశాను.. కనీసం ఉత్తరం అందలేదని అయినా తెలుస్తుందని... ఈ సంబంధిత వారు.. ఎక్కడున్నా ప్రశాంతంగా ఉంటారని...

ఉత్తరం అంటే కేవలం ఆత్మీయత, అనుబంధం అని మాత్రం ఆలోచిస్తున్న నాకు ఇటువంటివి కూడా ఉంటాయని తెలుసుకున్నాను.... చదవటం ఒక తప్పుని, చదవటం వల్ల ఒక మంచి పని చేశానని కూడా తెలుసుకున్నాను. కొన్నాళ్ళ వరకూ ఉత్తరం కోసం ఎదురుచూడటం మానుకున్నాను. ★